క్లుప్తంగా

తెరుచుకున్న బాత్‌రూమ్ డోర్లు



పాఠశాలల్లో తెరుచుకున్న బాత్‌రూమ్ డోర్లు

దెందులూరు: ఎట్టకేలకు గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో బాలికల బాత్‌రూమ్ డోర్లు బుధవారం తెరుచుకున్నాయి. బాలికల ఫిర్యాదు మేరకు ఈ పాఠశాలను జిల్లా విజిలెన్స్ కమిటీ సందర్శించి నివేదికను కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. బుధవారం డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ పాఠశాల బాత్‌రూం డోర్లను తెరిపించారు. బాలికలు జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పన్నుల వసూలుపై దృష్టి



కొణికిలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ చంద్రశేఖర్

పెదపాడు : ఈ నెలాఖరు నాటికి పన్నుల వసూలు 100 శాతం పూర్తి చేయాలని డీఎల్‌పీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం కొణికి గ్రామంలో పంచాయతీ చెరువు గట్టు వద్ద గ్రామస్తులకు ఆయన పన్నులు చెల్లింపుపై అవగాహన కల్పించారు. అనంతరం నాయుడుగూడెం, పెదపాడు గ్రామ పంచాయతీలో పన్నులు వసూళ్లపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఈఓఆర్డీ సాధనాల సూర్యకుమార్, ఈఓ మేకా శ్రీనివాస్, దాగాని వినోద్‌కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బూర్ సింగ్ మీనా తెలిపారు. బుధవారం కేంద్రీయ విద్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో మార్చి ఏడో తేదీ నుంచి మార్చి 21 వరకు, రెండో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీలను బట్టి ఆఫ్‌లైన్‌లో ఏప్రిల్ రెండో తేదీ నుంచి 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు కేంద్రీయ విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జాలిపూడిలో ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరంలో కంటి వైద్య పరీక్ష చేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త, దీపక్ నెక్సజన్ కంపెనీ అధినేత అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, కుమారుడు చైతన్య వాసు (మున్నా)తో పాటు ఎ.చైతన్యవాసు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. మానవత సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో పరమహంస యోగానంద నేత్రాలయ వైద్య బృందం సుమారు 350 పేదలకు కంటి పరీక్షలు చేశారు. 220 మందికి కళ్లజోళ్లు, మందులు అందజేశారు. వీరిలో 30 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. రోగులకు రాకపోకలకు బస్ సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో నెక్సజన్, మానవతా ప్రతినిధులు మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రైతు సేవా కేంద్రాల్లో అపరాల కొనుగోలు



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రసాద్

పెదపాడు: మండలంలోని పెదపాడులో రైతు సేవా కేంద్రంలో అపరాల కొనుగోలు చేయనున్నట్టు మార్క్‌ఫెడ్ మేనేజర్ సీహెచ్ ఎల్ఎన్‌డీవీ ప్రసాద్ గుప్తా తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులో రైతు సేవా కేంద్రంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. అపరాల శాంపిల్‌ను రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్లి నాణ్యతను పరిశీలించి, గోనె సంచులు అందిస్తారని చెప్పారు. రైతులు ముందుగా సీఎం యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో అపరాల కొనుగోలు కేంద్రాలు తెరచినట్టు చెప్పారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్ సీపీ

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

భీమడోలు: పేదల గుండె చప్పుడు వైఎస్సార్ సీపీ అని ఆ పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీపీ కనుమల ఆదాం అన్నారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆదేశాల మేరకు బుధవారం పార్టీ ఆవిర్భావ వేడుకను ఘనంగా నిర్వహించారు. జై జగన్, జై జై జగన్ అంటూ నినదించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ ఉద్యమాలు, పోరాటాలతో ఆవిర్భవించిందని, ప్రతి ఒక్కరి హృదయాల్లో చెరగని ముద్ర పెనవేసుకుందని వివరించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించిందని గుర్తుచేశారు. జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనకు తగిన గుణపాఠం తప్పదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు ఆల్తి గోపి, గంటా శ్రీనివాస్, దాసరి విజయభాను, ఆజామ్, పొల్నాటి శ్రీను, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ ఆల్తి శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా, జిల్లా ఎస్సీ సెల్ జాయింట్ కార్యదర్శి అంబటి నాగేంద్ర ప్రసాద్, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, మాజీ సర్పంచ్ చిలపర్తి రామారాయుడు, నాయకులు బుర్రకాయల కిరణ్, బి.రమేష్, సవలం పండు, నున్నా నాగేశ్వరరావు, ప్రత్తివాడ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. వీరంతా ఏలూరులో కలెక్టరేట్ వద్ద చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఫైర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఫ్లకార్డులను చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.

వైఎస్సార్ సీపీ వైపు.. పేదల చూపు

ఉంగుటూరు: సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమవడంతో పేదలు వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగారావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని చేబ్రోలు గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సదర్భంగా మంగారావు మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్నప్పుడే ప్రతి కార్యకర్తా పార్టీకి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ నేత, సొసైటీ మాజీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, గ్రామ మాజీ సర్పంచ్ కరణం బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేకును ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మిలు కట్ చేశారు. పార్టీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, ఎంపీటీసీ సభ్యులు మనసాల నాగమణి, రాయిలక్ష్మి, మనసాల కోటేశ్వరరావు, ఎంపీటీసీల చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, నాయకులు పెనుగొండ బాలకృష్ణ, అడపా శ్రీను, మిద్దే వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మాజీ సర్పంచ్ పెనుగొండ సూర్యచంద్రరావు, నల్లమాడు సర్పంచ్ గొతు రాము, పార్టీ మహిళా విభాగం నాయకురాలు మంద జయలక్ష్మి, పార్టీ ఉప్పాకపాడు, వెల్లమిల్లి, బాదంపూడి తదితర గ్రామాల నాయకులు పాల్గొన్నారు. రాజశేఖరెడ్డి విగ్రహం నుంచి జెండా దిమ్మె వరకు ప్రధాన రహదారిలో పార్టీ శ్రేణులతో కళకళలాడింది. అనంతరం ఏలూరులో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి తరలివెళ్లారు.



భీమడోలు గాంధీబొమ్మ సెంటర్‌లో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు



ఏలూరులో నినదిస్తున్న పార్టీ భీమడోలు మండల శ్రేణులు



ఉంగుటూరు : చేబ్రోలులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు



యువత పోరులో పాల్గొన్న ఉంగుటూరు మండల నాయకులు



గణపవరం : పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజలను మోసం చేసిన కూటమి పాలకులు

గణపవరం: ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ నేతలు విమర్శించారు. బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు క్యాంపు ఆఫీసు వద్ద వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుప్పాల చినబాబు, కన్నబాబు, కార్తీక్, జిల్లా రైతు సలహా సంఘం మాజీ అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి నడింపల్లి సోమరాజు, గణపవరం నిడమర్రు మండలాల పార్టీ అధ్యక్షులు దండు రాము, సంకు సత్యకుమార్, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే ప్రజారంజక పాలన

దెందులూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ప్రజా రంజక పాలన అందించారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, వడ్డే కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని కోరుకునే పార్టీ వైఎస్సార్ సీపీ అని వివరించారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం తథ్యమన్నారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసు రాజు, జిల్లా కార్యదర్శి కట్ట ఏసు బాబు, సంతోష్, సర్పంచులు ప్రభుదేవా, రఘు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరంతా మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు ఏలూరులో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని కామరెడ్డి నాని, తేరా ఆనంద్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాని



యువత పోరులో పాల్గొన్న పార్టీ నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి

వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరికీ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఒక ప్రకటనలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శ్రేణులు, అభిమానులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

భీమడోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి

భీమడోలు: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల, ఫుట్‌పాత్ వంతెనను విస్తరణ, తదితర సమస్యలపై ఏలూరు రైల్వే స్టేషన్‌కు విచ్చేసిన ఆ శాఖ జనరల్ మేనేజర్ అరుణకుమార్ జైన్‌కు బుధవారం భీమడోలు సీనియర్ సిటిజన్లు, గ్రామ పెద్దలు వినతిపత్రం అందించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వచ్చే భక్తులంతా ఈ స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారని, కొంత కాలంగా వివిధ కారణాలతో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఎత్తేశారని పేర్కొన్నారు. దీంతో భక్తులు ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో దిగి భీమడోలు మీదుగా ద్వారకాతిరుమలకు వెళ్తున్నారని వివరించారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని, భీమడోలు రైల్వేస్టేషన్‌లోని ఫుట్‌పాత్ వంతెన మూడు ట్రాక్‌లకు సరిపడేంత నిర్మించాలని కోరారు. రైల్వే జీఎంను కలిసిన వారిలో గ్రామ పెద్దలు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, పి.వెంకట్, ఆర్‌డీఎం ప్రసాద్, భోగరాజు రామారావు, మరడాని సత్యనారాయణలు ఉన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.



రైల్వే జీఎంకు సమస్యలను వివరిస్తున్న పెద్దలు

వైభవంగా భీమేశ్వరస్వామి తెప్పోత్సవం



పెదనింద్రకొలనులో భీమేశ్వరస్వామి తెప్పోత్సవం

నిడమర్రు: మండలంలోని పెదనింద్రకొలను స్వయంభూ భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు, మహిళలు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామానికి చెందిన మాధవరపు రాజా దంపతులు స్వామివారి తెప్పోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారిని ఊరేగించే తెప్పను పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం మోహన్ ఆర్కెస్ట్రా వారి సినీ మ్యూజికల్ నైట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నిరంతర వ్యాయామంతో ఆరోగ్యం

గణపవరం: క్రమంతప్పని వ్యాయామం, ఆహార నియమాలతో గుండె వ్యాధుల ముప్పుకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ గుండె వైద్య నిపుణులు టీపీఎస్ ప్రసాద్, గౌరీ శంకర్ రెడ్డి అన్నారు. బుధవారం గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎంఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. స్ట్రోక్, ఎంజినా గురించి, గుండె వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి రోజూ కనీసం గంట సమయం వ్యాయామానికి కేటాయించాలని సూచించారు పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిడమర్తి జయసూర్య, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో హిమశంకర్, నిమ్మల సుబ్బారావు, సంకు శ్రీను, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గౌరీ శంకర్ రెడ్డి

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలి

ఉంగుటూరు: ప్రజలు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పంచాయతీ కార్మికులకు అందించాలని ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ కోరారు. ఈ ప్రక్రియ అమలుకు మండలంలోని ఉంగుటూరు, బాదంపూడి, గొల్లగూడెం, తిమ్మయ్యపాలెం, దొంతవరం, చేబ్రోలు పంచాయతీలను ఎంపిక చేశామన్నారు. చెత్త వేసేందుకు బుట్టలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ గ్రామాల్లో ఈవోపీఆర్డీ బుధవారం పర్యటించారు. ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ బుట్టల పంపిణీ.

ఉంగుటూరు, నారాయణపురం గ్రామ పంచాయతీలలో ప్లాస్టిక్ బుట్టలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఉంగుటూరులో సర్పంచ్ బందారు సింధు, ఉపసర్పంచ్ పాతూరి జగదీష్, కార్యదర్శి రవికుమార్, నారాయణపురంలో సర్పంచ్ దిద్ల అలకనంద, కార్యదర్శి విజయ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



నారాయణపురంలో ప్రజలకు చెత్త బుట్టలను అందిస్తున్న సర్పంచ్ అలకనంద

అప్పు తీర్చమన్నందుకు దాడి

దెందులూరు: అప్పు తీర్చమన్నందుకు దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై ఆర్ శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. దెందులూరు శివారు అప్పారావుపాలెం గ్రామంలో నేతల వెంకటేశ్వరరావు నున్న లక్ష్మణరావుకు డబ్బులు ఇవ్వాలి. ఈ నెల 10వ తేదీ సాయంత్రం లక్ష్మణరావు వెంకటేశ్వరావును బాకీ తీర్చమని అడిగాడు. ఈ నేపథ్యంలో మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. లక్ష్మణరావు వెంకటేశ్వరరావును గోడకేసి కొట్టాడు. వెంకటేశ్వరరావు చెల్లి బావ అడ్డొచ్చారు. లక్ష్మణరావు కత్తి పిడితో వెంకటేశ్వరరావు, అతని బావ, చెల్లిని కొట్టాడు. ఈ ముగ్గురికీ గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై శివాజీ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

నిడమర్రు: సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థీ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వీర ప్రసాద్ అన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్‌లపై అవగాహన రథం నిడమర్రు జెడ్పీ స్కూల్‌కు బుధవారం వచ్చింది. రథంపై ఉన్న డిజిటల్ స్క్రీన్‌లతో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పలు లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై వీర ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాల పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో స్మార్ట్ ఫోన్ వాడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్‌లు పిల్లలు ఉపయోగిస్తున్నపుడు తెలియని మెయిల్, వెబ్‌సైట్‌ల లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు చెప్పమని ఫోన్‌లు వస్తే కట్ చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్లు, కంప్యూటర్లు హ్యాక్ చేసి డేటా మొత్తం సేకరిస్తారని వివరించారు. కార్యక్రమంలో నిడమర్రు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



సైబర్ నేరాలపై లఘుచిత్రాన్ని ప్రదర్శిస్తున్న ఎస్సై వీరప్రసాద్

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టండి

భీమడోలు: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అన్నారు. పోలసానిపల్లి నుంచి భీమడోలు జంక్షన్ వరకు గల వివిధ దుకాణాలను సంత నేపథ్యంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. చికెన్, మటన్, చేపలు, వివిధ ఆకుకూరల దుకాణాల యాజమానులకు ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దంటూ మైక్ ద్వారా అవగాహన కల్పించారు. వాడితే జరిమానాలను విధిస్తామని, అవసరమైన దుకాణం లైసెన్సులు రద్దు చేస్తామని గ్రామ కార్యదర్శి జయరామకృష్ణ హెచ్చరించారు. పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్‌ను వాడవద్దని, నేటి సమాజానికి పెనుముప్పుగా మారిందని, వాటిని వాడడం వల్ల కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని వివరించారు. దుకాణాల వద్ద ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దలు షేక్ హసేనా, వి.గోవింద్, మడ్డు శ్రీను, యర్రంశెట్టి సతీష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పోలసానిపల్లిలో మైక్‌తో ప్రచారం చేస్తున్న దృశ్యం

నేటి నుంచి ముగ్గురమ్మల జాతర

గణపవరం: మండలంలోని పిప్పర గ్రామ దేవతలు మహాలక్ష్మి, మహంకాళి, బంగారుపాపమ్మల జాతర మహోత్సవాలు ఈనెల 13 నుంచి 15 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ పేర్కొంది. గురువారం రాత్రి అమ్మవార్ల గవళ్లగుడువు సేవ, గ్రామోత్సవం ఉంటుందని తెలిపింది. ఉత్సవాలకు అమ్మవార్ల ఆలయాలను ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పిప్పరతో పాటు పరిసర 10 గ్రామాల ప్రజలు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. గ్రామానికి ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామంలోని ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి.

దంతాలపై ప్రత్యేక శ్రద్ధ

పెదవేగి : ప్రతి వ్యక్తీ దంతాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. బుధవారం దుగ్గిరాల దంత కళాశాల్లో వరల్డ్ ఓరల్ హెల్త్ డే ఘనంగా నిర్వహించారు. ఏలూరు సిద్ధార్థ విద్యాలయ విద్యార్థులు 250 మందికి ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. డెంటల్ కిట్‌లను పంపిణీ చేశారు. బ్రష్ చేసుకొనే విధానం, ఆరోగ్యకరమైన చిగుళ్ల కోసం పాటించాల్సిన నియమాలు, పళ్లు పుచ్చిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్‌ఓడీ డాక్టర్ పి.అరవింద్ కుమార్, వైద్యులు హరీష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

గాలిగోపురం నిర్మాణానికి శంకుస్థాపన

పెదపాడు : మండలంలోని రాజుపేట రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గాలిగోపురం (రాజగోపురం) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇటీవల పునర్నిర్మాణం చేపట్టిన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గాలిగోపురం నిర్మాణ దాతలు మేడూరి నాగేశ్వరరావు శైలజ దంపతులచే శంకుస్థాపన పూజలు చేశారు. వేదపండితులు వేద మంత్రోచ్ఛరణలతో శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సింగిల్ ట్రస్టీ గూడూరు రామలింగేశ్వర శర్మ, గూడూరు అన్నపూర్ణమ్మ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

దెందులూరు: సోమవరప్పాడు జనార్ధన స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 13 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త చలసాని శ్రీధర్ తెలిపారు. బుధవారం సోమవరప్పాడు ఆలయం వద్ద ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాలు ఈనెల 17 వరకు కొనసాగుతాయని చెప్పారు. భక్తులంతా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జూదరుల అరెస్ట్

పెదవేగి : పెదవేగి గ్రామంలో బుధవారం పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తుల్ని అరెస్ట్ చేసి, రూ.13 వేల నగదు, నాలుగు మోటారు సైకిల్‌లు స్వాధీనం చేసుకున్నట్లు కె.రామకృష్ణ తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పెదపాడు : ప్రతి రైతూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ అనానరు. మండలంలోని వట్లూరు, నాయుడగూడెం గ్రామాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు తప్పనిసరిగా రైతు ఐడీ పొందాలని అన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రైతుల వివరాలు ప్రదర్శిస్తామని చెప్పారు. రైతులు పోలుపర్తి కన్నారావు, పులవర్తి శ్రీనివాసరావు, గుండుమెడ మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.